క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



సత్తెనపల్లి: లయన్స్ సేవా దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి టౌన్ లయన్స్ క్లబ్ సభ్యులు పట్టణంలోని మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వేంకటేశ్వర రావు, సభ్యులు వై.పి.మురళీకృష్ణ, తోట చినసాంబశివరావు, కె. గురుప్రసాద్, పెద్దింటి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

88త్యాళ్లూరు(క్రోసూరు): 88 త్యాళ్లూరు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీవో బి.మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యులు, ప్రత్యేక వైద్యులు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందలు అందచేస్తారని ఆయన పేర్కొన్నారు.

ఓర్వకల్లులో...

అచ్చంపేట: ఓర్వకల్లులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, ప్రత్యేక వైద్యులు పాల్గొని గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆయుష్ సెంటర్ మరమ్మతుల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో గల ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోని మరమ్మతు పనులను గ్రామసర్పంచ్ కంచర్ల వెంకటేశ్వర్లు, ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.3.50లక్షల నిధులతో మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. జనఆరోగ్య సమితి సభ్యులు కంచర్ల భాస్కరరావు, కంచర్ల చిన సుబ్బారావు, సోమేపల్లి కొండలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ ఆదివారం తెలిపారు. కుంకలగుంట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసిన పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.48,760లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

చిట్టాపురంలో..



ఈపూరు: మండలంలోని చిట్టాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఈపూరు ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4960 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రెంటచింతలలో వేసవిని తలపిస్తున్న ఎండలు

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాలలోనే ప్రతి వేసవిలో మంటచింతలగా పేరు పొందిన రెంటచింతల ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వర్షాకాలంలో సైతం వేసవిని తలపిస్తూ మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా రెంటచింతలలో 37.5 నుంచి 38.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ ఎండలకు గ్రామాలలోని చెరువులు, కుంటలు, బోరులు ఎండిపోతున్నాయి. ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన పగలు భగభగ మంటూ ఎండ కాస్తుంటే బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. పగలు, సాయంత్రం తేడా లేకుండా ఉక్కపోతగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేతకు(పశుగ్రాసం) కోసం పొలం వెళ్లిన పశువులు, జీవాలు(మేకలు, గొర్రెలు) ఎండ తీవ్రకు తట్టుకోలేక నీటి మడుగులలోకి, చెట్లనీడకు చేరుకుంటున్నాయి.

ఖర్చు మితం.. పోషణ అమితం

- చిరుధాన్యాలతో పౌష్టికాహారం
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పదార్థాల స్టాల్స్ ప్రదర్శన
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు వేదికగా అవగాహన
- గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు



పెద్దమక్కెనలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పోషక పదార్థాల ప్రదర్శన

సత్తెనపల్లి: ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు పెద్దలు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటేనే ఎవరికైనా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. తద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరిగి, రోగాలకు దూరంగా ఉండవచ్చు. సాధారణంగా ఖరీదైన పదార్థాల్లోనే పోషక విలువలు ఉంటాయని అందరూ భావిస్తుంటారు. కాని మన ఇంట్లో ఉన్న పదార్థాలతోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా చిరు ధాన్యాలతో వివిధ పదార్థాలను తయారు చేసి, ప్రదర్శిస్తున్నారు.

సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలున్నాయి. వీటి పరిధిలో 301 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు మినీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు 1,914 మంది, బాలింతలు 1,634 మంది, ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు 1,902 మంది, ఏడాది నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు 7,167 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకూ 5,656 మంది పిల్లలు ఉన్నారు.

పోషకాలు అధికం ...

రాగులు, జొన్నలు, కొర్రలు, గోధుమ తదితర చిరు ధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా మనకు సంపూర్ణ పోషణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా విటమిన్లు అందుతాయి. గర్భిణులు, బాలింతలు ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ శిబిరాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిరు ధాన్యాలతో తయారు చేసుకునే ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్నారు. తద్వారా అక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు.



స్టాల్‌లోని పోషక పదార్థాలు

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోంది. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. న్యూట్రీషన్ ఫుడ్, చిరు ధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా మనకు సంపూర్ణ పోషణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

–టి.శ్రీలత, సీడీపీవో, సత్తెనపల్లి.

అమరావతి – బెల్లంకొండ రోడ్డు పరిశీలన



సంఘ పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: అమరావతి – బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం జూపూడి వద్ద ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. సుమారు 47 కిలోమీటర్ల మేర 10 మీటర్ల వెడల్పుతో రూ.149 కోట్ల నిధులు వెచ్చించి ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికే సుమారు 30 కిలోమీటర్ల మేర రోడ్డు వెడల్పు చేసినట్లు తెలిపారు. జూపూడి, మునుగోడు, ఊటుకూరు మొదలగు గ్రామాల్లో 7 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు.

బయ్యవరం ఎస్సీ కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలోని ఎస్సీ కాలనీని ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రార్థన మందిరంలో సంఘ పెద్దలు, మహిళలతో మాట్లాడారు. కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎంతో పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ తమ కాలనీని సందర్శించి, ఇక్కడి సమస్యలు తెలుసుకున్నందుకు ఎమ్మెల్యేకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొతారు వెంకట్రావు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫార్, మండలాధ్యక్షుడు వెలది అప్పారావు, కడియం రామారావు, శిరసాని కాశీ విశ్వేశ్వరరావు, చందు పెదబాబు, చంకా మాణిక్యరావు, బెల్లంకొండ బ్రహ్మయ్య, బోడేపూడి రవి పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సర్వేను పరిశీలించి, సూచనలిస్తున్న కౌన్సిలర్ కల్యాణి

సత్తెనపల్లి: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కౌన్సిలర్ లోక కల్యాణి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వేను పరిశీలించిన కౌన్సిలర్ కల్యాణి వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

టీటీడీ కల్యాణ మండపం స్థల పరిశీలన



స్థలం పత్రాలు, గ్రామస్తుల విరాళం నగదు చెక్కులను ఎంపీ, ఎమ్మెల్యేకు అందిస్తున్న గ్రామ పెద్దలు

- టీటీడీ మాజీ చైర్మన్ వైవీకి ఎంపీ లావు, ఎమ్మెల్యే నంబూరు కృతజ్ఞతలు
- తమ విరాళం రూ.40లక్షలు, స్థలం పత్రాలు అందించిన గ్రామ పెద్దలు

పెదకూరపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.2 కోట్లతో మండలంలోని 75 త్యాళ్ళూరులో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపం స్థలాన్ని నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు కేటాయించిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండపం నిర్మాణానికి తమవంతు సాయంగా గ్రామస్తులు గుత్తికొండ ఆంజిరెడ్డి ఆధ్వర్యంలో గుత్తికొండ రామకృష్ణారెడ్డి రూ.11,75వేలు, గుత్తికొండ తిరుపతిరెడ్డి రూ.8.25లక్షలు, జొన్నల వెంకటరెడ్డి రూ.8 లక్షలు, గుత్తికొండ అప్పిరెడ్డి రూ.2 లక్షలు, అరబిందో ఫార్మా కంపెనీకి చెందిన నిత్యానందరెడ్డి రూ.10లక్షలు, మండపం నిర్మాణానికి అవసరమైన ఎకరం స్థలం కేటాయించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సంబంధించిన చెక్కులను, స్థలం పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేకు గుత్తికొండ ఆంజిరెడ్డి అందించారు. కల్యాణ మండపం నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేలా కృషి చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు అన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ చైర్మన్ జాలయ్య, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫాదర్ బాలస్వామికి సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని క్రైస్తవ చర్చిలు, ఏబీఎం, హౌస్ ఆఫ్ ప్రేయర్స్ చర్చిలను రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ రెవ. ఫాదర్ డాక్టర్ ఎం.బాలస్వామి ఆదివారం సందర్శించారు. ఏబీఎం చర్చి ప్రెసిడెంట్ జి.మార్కు, జి.ఇశ్రాయేలు, ఫాదర్ బాలస్వామిని ఘనంగా సత్కరించారు. హౌస్ ఆఫ్ ప్రేయర్స్ చర్చి రెవ పాస్టర్ సత్యం, పాస్టర్ జార్జ్ సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు చుక్కా మోషే గృహంలో విందు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు టి.రాజు, జి.పున్నయ్య, పాస్టర్ జి.సుధీర్ కుమార్, పి.స్వరూప కుమార్, సంఘ పెద్దలు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

10లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలో సాగు చేపట్టిన రైతులు పంటలకు ఈ నెల 10వ తేదీలోపు ఈకేవైసీ చేయించాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.అరుణ ఆదివారం చెప్పారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసిన రైతుల వివరాలు సోషల్ ఆడిట్‌లో భాగంగా గ్రామ సచివాలయంలోని నోటీసు బోర్డులో ఈ నెల15వ తేదీ వరకు అందుబాటులో ఉంచటం జరుగుతుందన్నారు. పంట నమోదులో ఏమైనా సమస్య వస్తే 18 నుంచి 15వ తేదీ వరకు గ్రీవెన్స్‌లో స్వీకరించబడుతుందన్నారు. 2న తుది జాబితాను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులు తప్పని సరిగా సాగు చేసిన పత్తి, మిరప, పసుపు, వరి పంటల వివరాలకు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం

కేసానుపల్లిలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులు



కేసానుపల్లి ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కోరారు. కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.50లక్షల నిధులను ఎమ్మెల్యే కాసు మంజూరు చేయించారు. దీంతో సర్పంచ్ వినుకొండ చిన్న కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టారు. ఈ పనులను ఏఈ శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, స్థానిక నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు, చుండు రామారావు, చెట్టిపోగు పాపయ్య, మీసాల ఆనందరావు తదితరులు పర్యవేక్షించారు. కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ఏడుగురి నుంచి అపరాధ రుసుం వసూలు



గణవపరంలో ఓ చికెన్ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకరరావు

నాదెండ్ల: తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో పలు వ్యాపార దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. కాటాల్లో వ్యత్యాసం ఉన్న ఏడుగురిని గుర్తించారు. వీరి వద్ద అపరాధ రుసుము వసూలు చేశారు. చికెన్ షాపులు, చిల్లర దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలు, కాటా రాళ్లు, అడ్డకాటా తదితర వాటిని పరిశీలించారు. ప్రతి ఏడాది ఎలక్ట్రానిక్ కాటాలు ఉన్న యజమానులు రెన్యువల్ చేయించుకోవాలని, కాటా రాళ్లు, అడ్డకాటా ఉన్న వాళ్లు ప్రతి రెండేళ్లకోసారి తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ అధికారుల వద్ద రెన్యువల్ చేయించుకోవాలన్నారు. తూనికల్లో తేడాలు ఉంటే చర్యలు తప్పవని నరసరావుపేట ఏరియా ఇన్‌స్పెక్టర్ శంకరరావు హెచ్చరించారు. ఆయనతో పాటూ సిబ్బంది వీరయ్య ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



డ్రంక్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ పాల్‌రవీందర్, పోలీసు సిబ్బంది

క్రోసూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పాల్‌రవీందర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపటం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడితే.. వాహనంతో పాటు యజమానిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో పురుగు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరుముల కృష్ణారెడ్డి (38) 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. సాగులో సరైన దిగుబడి రాక రూ.7 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పులిచ్చినవారు ఒత్తిడికి గురిచేయటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తీసుకెళ్ళగా వైద్యులు చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందాడు. ఈయనకు భార్య దివ్య, కుమారులు సువర్ణరెడ్డి, అఖిల్‌రెడ్డిలు ఉన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ వేస్ట్ రాయికి రాయల్టీ చెల్లించలేం

ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల ఆందోళన



ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



క్వారీ వేస్ట్ రాయిని తీసుకొస్తున్న ట్రాక్టర్‌ను ఆపిన చెక్‌పోస్టు నిర్వాహకులు

పిడుగురాళ్ల: క్వారీలో వేస్ట్ రాయి, మట్టి తోలుకునే వారికి కూడా రాయల్టీ చెల్లించాలని చెక్ పోస్టు నిర్వాహకులు ట్రాక్టర్లను నిలిపివేయటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పిల్లుట్ల రోడ్డులోని సున్నపుబట్టీల సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు మాట్లాడుతూ వేస్ట్ రాయి ఒక ట్రిప్పుకు రూ.400లు వస్తాయి, అందులో లోడింగ్ చేసినందుకు రూ.100, డీజిల్‌కు రూ.100, డ్రైవర్‌కు రూ.100 పోను మిగిలేది వంద రూపాయలు మాత్రమే. రోజుకు నాలుగు లేదా ఐదు ట్రిప్‌లు మాత్రమే ఒక ట్రాక్టర్ ద్వారా రవాణా జరుగుతుందని తెలిపారు. రోజుకు రూ. 500లు కూలీ గిట్టుబాటు అవుతుంది, ఒక ట్రిప్ వేస్ట్ రాయి, మట్టికి రూ. 250 రాయల్టీ చెల్లించాలని, లేని పక్షంలో వేస్ట్ రాయిని అక్కడ వదిలివేసి వెళ్లాలని చెక్ పోస్టు నిర్వాహకులు హుకుం జారీ చేయటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, ట్రాక్టర్లను చెక్‌పోస్టు సమీపంలోనే నిలుపుదుల చేసి ఆందోళనకు దిగారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆందోళనను గమనించి ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో మాట్లాడారు. సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తానని తెలపటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

గురజాల : ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన ఓర్సు శ్రీరామ్ పిడుగురాళ్ల వైద్యశాలలో ఉన్న చెల్లెలిని చూడటానికి టీవీఎస్ ఎక్స్ఎల్‌పై బయలుదేరాడు. గురజాల నుంచి మాచర్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బొలెరో వాహనాన్ని క్రాస్ చేస్తున్న తరుణంలో రెంటచింతల సమీపంలో నర్సరీ వద్ద టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓర్సు శ్రీరామ్ తలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన వైద్యం కొరకు గుంటూరుకు రిఫర్ చేయడం జరిగింది. క్షతగాత్రుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

చేతిరాతపై శిక్షణ కార్యక్రమం

శావల్యాపురం: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు చక్కని దస్తూరి (చేతిరాత) ఎంతోగానో దోహదపడుతుందని జడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు దస్తూరి మెరుగుదలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో తెలుగు, ఆంగ్ల భాషలకు సంబంధించి చక్కని దస్తూరి ఉన్నవారికి ప్రత్యేకంగా మార్కులు కేటాయిస్తారన్నారు. దాతల సహకారంతో దస్తూరి నిపుణులు నోట్ పుస్తకాలన్నీ సమకూర్చారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు సంద్రపాటి చలపతిరావు, గట్టుపల్లి వీరాస్వామి, దస్తూరి నిపుణులు శ్రీనివాసరావు, పి.వెంకట పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.

సాహిత్య సేవ అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



యువ కవులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న సాహితీ యజ్ఞం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం రామిరెడ్డిపేటలో పల్నాడు కవితోత్సవం పేరిట ఏర్పాటు చేసిన 124వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కవితోత్సవంలో పాల్గొన్న కవులను అభినందించారు. కళావేదిక నిరంతరం కవి సమ్మేళనాలను నిర్వహిస్తూ సాహిత్య సేవ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీనాథుడు, కొప్పరపు కవులు, విశ్వకవి గుర్రం జాషువా వంటి మహనీయులకు అలవాలమైన పల్నాటి గడ్డ సాహిత్య సేవలో నిరంతరం తరిస్తున్నదని వివరించారు. ఈసందర్భంగా కవితోత్సవానికి హాజరైన కవులను ఘనంగా సత్కరించారు. తొలుత సాహితీమూర్తుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను గజమాలతో సత్కరించారు. అలాగే కళావేదిక జిల్లా అధ్యక్షురాలు శాంతిభాయ్ గాయనిగా రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కందుల ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి దసరా వేడుకలు ప్రారంభం



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా ఉత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు జరుగుతాయని దేవాలయ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి 22వ వార్షికోత్సవాలు గ్రామస్తులు, దాతల సహకారంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. రాత్రిళ్లు దేవాలయం ప్రాంగణంలో భక్తి బృందంచే భజనలు, అనంతరం మహిళ భక్తులకు ప్రోత్సాహక బహుమతులు లాటరీ విధానం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

